పునాదుల్లోనే సమీకృత మార్కెట్

- ఏడాదిగా పిల్లర్ దశలోనే పనులు
- రూ.2 కోట్లతో పనులు ప్రారంభం
- బిల్లుల రాక పనులు నిలిపివేత
- పట్టించుకోని అధికారులు, పాలకులు


పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన సమీకృత మార్కెట్ పనులు

సుల్తానాబాద్: పట్టణంలో సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్ నిర్మాణం మొదలై ఏడాది కావొస్తున్నా.. పనులు పూర్తి కావడం లేదు. పట్టణంలోని మార్కెట్ యార్డులో సర్వే నంబర్ 773 లో ఎకరం భూమి కేటాయించి, భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్లు పనులు చేపట్టి పిల్లర్ల వరకు పూర్తి చేశారు. కానీ బిల్లులు రాక పనులు మధ్య లోనే నిలిపివేశారు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే అన్ని రకాల సామగ్రి వినియోగదారులందరికీ ఒకే చోట దొరుకుతుంది. వ్యాపారులందరూ ఒకే చోట విక్రయాలు సాగించొచ్చు. కొనుగోలుదారులకు కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. చేపలు,మాంసం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పూలు తదితర సామగ్రి ఒకే చోట విక్రయించుకునే అవకాశం ఉంటుంది.

మూడేళ్ల క్రితం సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారింది. పట్టణ అభివృద్ధికి అనుగుణంగా పలు అభివృద్ధి పనులు చేపట్టారు. మున్సిపల్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అయితే ఏడాది గడుస్తున్నా పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి. సుల్తానాబాద్ పట్టణంలో చేపలు విక్రయించుకునేందుకు మార్కెట్ వసతి లేకపోవడంతో ఇటు విక్రయదారులు, అటు కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని చౌరస్తా వద్ద రహదారులపైనే విక్రయాలు సాగిస్తున్నారు. రహదారిపై అమ్మితే దుమ్ము, ధూళి అధికంగా వస్తోందని, వినియోగదారులు కొనుగోలుకు వెనకాడుతున్నారని వ్యాపారులు వాపోతున్నారు.

బిల్లు రాకపోవడంతో పనులు బంద్

సదరు కాంట్రాక్టర్లు మాత్రం పనులు చేసిన వరకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు చెప్తున్నారు. బిల్లులు మంజూరైతే పనులు చేస్తామని, ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని చేసిన పనులు సంబంధించి బిల్లులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అందుబాటులోకి తీసుకురావాలి



ప్రజలకు సమీకృత మార్కెట్ అందుబాటులోకి తీసుకురావాలి. ప్రస్తుతం రోడ్డుపై మార్కెట్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పనులు పూర్తి చేసేలా అధికారులు, పాలకవర్గం చొరవ తీసుకోవాలి.

– అమిరి శెట్టి తిరుపతి, సుల్తానాబాద్

పట్టణ అభివృద్ధికి కృషి చేయాలి



సుల్తానాబాద్‌లో పట్టణ అభివృద్ధికి భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వం సమీకృత మార్కెట్ మంజూరు చేసింది. కానీ పనులు పూర్తి కావడం లేదు. దీనిపై అధికారులు, పాలవర్గం చొరవ తీసుకుని వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– గరిగే శ్రీనివాస్, సుల్తానాబాద్

ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలి



సమీకృత మార్కెట్ నిర్మాణంలో కొంత ఆలస్యం జరిగింది. కొన్ని రోజుల నుంచి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏడాదిలోగా భవన నిర్మాణ పనులు పూర్తి చేయించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– శ్రీనివాసరెడ్డి రెడ్డి, మున్సిపల్ కమిషనర్, సుల్తానాబాద్

క్లుప్తంగా

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే వాటిని అదుపు చేసే పద్ధతులపై కనీస అవగాహన ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ అన్నారు. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్, షాపింగ్‌మాల్‌లో పొగ నిండిపోతే మెట్ల మార్గంలో కిందికి ఎలా రావాలో అందులో పనిచేసే సిబ్బందికి ప్రయోగాత్మకంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది సిరాజుద్దీన్, శ్రావణ్, నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ కోరారు. శుక్రవారం పట్టణంలో ఉద్యమకారుల ఆత్మ గౌరవ సదస్సు పోస్టర్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షులు పడాల శ్రీరాములుతో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 12న హైదరాబాద్ రాజధానిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కూకట్ల నాగరాజు పెగడ శ్యాంసుందర్, బోయిని భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమాతో ప్రతి కుటుంబానికి ధీమా


చెక్కు అందిస్తున్న ఎంపీపీ ముత్తయ్య

రామగిరి: ప్రతి ఒక్కరూ విధిగా బీమా తీసుకుని తన కుటుంబానికి ధీమా కల్పించాలని ముత్తారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య సూచించారు. ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లిలో ఇటీవల అనారోగ్యంతో చంద్రమౌళి మృతి చెందాడు. బాధిత కుటుంబానికి లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి మంజూరైన రూ.1.25లక్షల బీమా చెక్కును శుక్రవారం అందించారు. కార్యక్రమంలో లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏజీఎం అట్ల సురేశ్ యాదవ్, మంథని బ్రాంచ్ మేనేజర్ పైడాకుల రమేశ్, ఇన్సూరెన్స్ కంపెనీ యూనిట్ మేనేజర్లు బాసాని సాగర్, బొడిగె గిరీశ్, డీవోలు లింగన్నపేట శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

మంథని: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కష్టపడి చదవాలని బీసీ సోషల్ వెల్ఫేర్ ఆర్‌సీవో గౌతమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంథని మండలం వెంకటాపూర్ బీసీ సోషల్ వెల్ఫేర్ వసతి గృహంలో నిర్వహించిన వేడుకల్లో మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల బాగుకోసం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీవో సుస్మిత, ప్రిన్సిపాల్ నాగలత, సర్పంచ్ సరోజన, ఉపసర్పంచ్ వెంకటస్వామి, సీఆర్పీ మల్లయ్య ఉన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

నేటి సమాజంలో విద్యార్థినులు ఆత్మస్థైర్యంలో ముందుకు సాగాలని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ అన్నారు. శుక్రవారం మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల జరిగిన కళాశాలలో జరిగిన వార్షికోత్సవంలో మాట్లాడారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ సమాజానికి సేవ చేసే స్థాయిలో ఉండేందుకు కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సలీమ్, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అవయవదానం చేయాలి

రామగిరి: ప్రతి ఒక్కరూ అవయవదానం చేయాలని సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ సూచించారు. ముత్తారం మండలం కేశనపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మందల కాంతమ్మ కళ్లను కుటుంబ సభ్యులు దానం చేయగా శుక్రవారం సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూనె కుమార్, ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భీష్మాచారి, ప్రధాన కార్యదర్శి సీహెచ్. లింగమూర్తి, సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం


కూనారంలో స్వామి వారి కల్యాణం


తేలుకుంటలో శివపార్వతుల కల్యాణం

జూలపల్లి: మండలంలోని తేలుకుంటలో శుక్రవారం శ్రీ మార్కండేయ ఆలయంలో పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణంలో శివసత్తులు పాల్గొని శివనామ స్మరణ చేస్తుండగా, వేద పండితులు కల్యాణఘట్టం నిర్వహించారు. జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, బీఎస్పీ పెద్దపల్లి నియోజక వర్గ ఇన్‌చార్జి దాసరి ఉష పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణంలో సంఘం నాయకులు బొద్దుల కనుకయ్య, చిప్ప శ్రీకాంత్, రమేశ్, దేవిసాని శ్రీనివాస్, దొంతుల రాజమల్లు, రాజేశం,బొద్దుల నారాయణ, కైలాసం,వెంకటన్న,తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ కల్యాణం

సుల్తానాబాద్: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఉన్న సాంబశివ ఆలయంలో శుక్రవారం రాత్రి వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య శివ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పట్టణంలో పుర వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళీధర్, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కొమరవెల్లి భాస్కర్, పలువురు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనారసింహ కల్యాణం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కూనారంలో శ్రీలక్ష్మీ నారసింహా స్వామి కల్యాణం శుక్రవారం అంగరంగా వైభవంగా భక్తుల కోలాహలంతో జరిగింది. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారలకు ఒడిబియ్యం, సారెచీర, కట్నకానుకలు సమర్పించారు. హనుమాన్ స్వామి భక్తులు భజనలు కీర్తనలు చేశారు. ఉత్సవ మూర్తుల ఊరేగింపు చేశారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కల్యాణానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొట్టె సుజాత, సర్పంచు డొంకెన విజయ, ఎంపీటీసీ కొల్లూరి రమాదేవి, సొసైటీ చైర్మన్లు పురుషోత్తం, రాంచంద్రా రెడ్డి, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన


బొడ్రాయి ప్రతిష్ఠాపనలో కార్పొరేటర్,జెడ్పీటీసీ

గోదావరిఖనిటౌన్: స్థానిక చంద్రబాబునాయుడు కాలనీలో బొడ్రాయి ప్రతిష్ఠాపన శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. పోచమ్మ కొలువు భూదేవి సహిత బొడ్రాయి మహాలక్ష్మి మైసమ్మ, నాగులమ్మ విగ్రహ ప్రతిష్ఠకార్యక్రమాల్లో భాగంగా కాలనీలోని మహిళలు వందల సంఖ్యలో కుటుంబాలతో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, రంగు రాయమల్లు,నాయకులు పాల్గొన్నారు.

గ్రామదేవతల ప్రతిష్ఠాపనోత్సవాలు

ఓదెల: మండలంలోని ఇందుర్తిలో గ్రామదేవతల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భూలక్ష్మి, మహలక్ష్మి, యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ఏర్పాటు వైభవంగా జరిగాయి. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబాల సంధ్యారాణి, పాత్కపల్లి సొసైటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లిలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు..

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో రేణుకాఎల్లమ్మ ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

మంత్రపురిలో ఘనంగా సంకటహర చతుర్థి

మంథని: రాష్ట్రంలోనే ఏకైక అష్టభుజ మహాగణపతి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుర్థి సందర్భంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు చేశారు. మంథనితో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పూజలు చేశారు. ఆలయ పూజారులు పల్లి సంజీవ్, రాము భక్తులకు ఆశీర్వాదం అందించారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దబొంకూర్, పెద్దకల్వల గ్రామాలతో పాటు రంగంపల్లి, చందపల్లి, పెద్దపల్లిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని పీజీసెంటర్, రాంమందిర్, గౌతమినగర్, జనగాం, అల్లూర్ పరిధిలో నేడు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ అడిచెర్ల శ్రీనివాస్ తెలిపారు.

ఫెర్టిలైజర్‌సిటీ: గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో 33,11పీజీ సెంటర్, రామ్‌మందిర్, గౌతమినగర్, జనగాం సబ్‌స్టేషన్ పరిధిలో నేడు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ అడుచెర్ల శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు.

నేడు ఉచిత దంత వైద్యశిబిరం

పాలకుర్తి: మండలంలోని కన్నాలలో శనివారం శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలోని కమ్యూనిటీహాల్ వద్ద ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు తొగరి తిరుపతి తెలిపారు.ఈ వైద్యశిబిరానికి మోహన్ డెంటల్ ఆసుపత్రి వైద్యబృందం హాజరవుతారని, పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని తిరుపతి తెలిపారు.

13న ఉచిత నేత్ర వైద్య శిబిరం

సుల్తానాబాద్: లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు శ్రీవాణి జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారిని గుర్తించి రేకుర్తిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని తెలిపారు వివరాలకు లయన్స్ క్లస్ ఆఫ్ సుల్తానాబాద్ అధ్యక్షుడు కోడూరి సతీశ్ కుమార్ 9246933220, కార్యదర్శి పిట్టల వెంకటేష్ 9866961518. నవీన్ సెల్ 8121122124 సంప్రదించాలని కోరారు.

14 లోగా అభ్యంతరాలు లిఖితపూర్వకంగా సమర్పించాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని అంతర్గాం, గోలివాడ, టీటీఎస్ అంతర్గాం గ్రామాల్లో 60 డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు కోసం ఫిబ్రవరిలో మూడు గ్రామాల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇళ్ల కోసం 392 మంది దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అనంతరం సదరు గ్రామాల్లో లబ్ధిదారుల జాబితా ఉంచామని తహసీల్దార్ కత్రోజు వేణుగోపాల్ తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 14లోగా ప్రజల నుంచి లిఖితపూర్వకంగా దరఖాస్తులు సమర్పిస్తే మరోసారి విచారణ చేపట్టి అర్హులకు కేటాయిస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

రక్తదానంపై అపోహలు వీడాలి

కోల్‌సిటీ: అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కజాంపురం రాజేందర్ పిలుపునిచ్చారు. గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని రాహుల్ ఆస్పత్రిలో ఓ మహిళకు అత్యవసరంగా రక్తం అవసరం ఏర్పడగా, స్పందించిన దూడపాక రాజు అనే టెంట్‌హౌజ్ యజమాని, ఆస్పత్రికి వచ్చి రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా రక్తదాత రాజును రాజేందర్ అభినందించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ సంపత్, దూడపాలక మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తులు అందజేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం ముత్తారం పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం లయన్స్‌క్లబ్ సభ్యుడు ఎరబాటి వెంకటేశ్వర్ రావు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కార్యదర్శి తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడక, కనగర్తి గ్రామాల్లో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

16న మండల సర్వసభ్య సమావేశం

కమాన్‌పూర్: ఈ నెల 16న ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాసకొండ లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికా రులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలి


నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. శుక్రవారం అధికార పార్టీ ప్రతినిధులుగా అమరేందర్, నడిపెల్లి మురళీధర్‌రావును నియమించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, కార్పొరేటర్లు కొమ్ము వేణుగోపాల్, పాముకుంట్ల భాస్కర్, కోఆప్షన్ సభ్యులు వంగ శ్రీనివాస్‌గౌడ్, చెరుకు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మహిళా విభాగం అధికార ప్రతినిధిగా చంద్రకళ

జ్యోతినగర్: బీఆర్ఎస్ రామగుండం నియోజకవర్గం మహిళా విభాగం అధికార ప్రతినిధిగా గోలివాడ చంద్రకళను నియమిస్తూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం అన్నపూర్ణకాలనీ ప్రాంతానికి చెందిన చంద్రకళ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని గుర్తించి పదవి అప్పగించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులకు చంద్రకళ కృతజ్ఞతలు తెలిపారు.

'పుట్ట, పూదరి'లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి


ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ దేవక్క దంపతులు

రామగిరి: 'మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేసున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి' అని రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క, కొమురయ్య గౌడ్ దంపతులు కోరారు. శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. రామగిరి ఎంపీపీగా ఎన్నికైన నాటి నుంచి తమను పూదరి సత్యనారాయణ అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తూ, సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్టు పోస్టులు పెడుతూ తమ పరువుకు భంగం కలిగించాడని, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. పైగా ఈనెల 2న తమను జెడ్పీ కార్యాలయంలో అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా న్యాయవాద దంపతులకు పట్టిన గతి మీకు పడుతుందని భయభ్రాంతులకు గురి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వారు తెలిపారు.

మహిళలకు వంటల పోటీలు


మహిళలను అభినందిస్తున్న కమిషనర్ సుమన్‌రావు

కోల్‌సిటీ: స్వశక్తి మహిళలకు రామగుండం నగరపాలక సంస్థ అధికారులు వంటల పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బల్దియా నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా, శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో బల్దియా కార్యాలయంలో నిర్వహించిన వంటల పోటీల్లో స్వశక్తి మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరు ధాన్యాల ఏడాదిగా ప్రకటించిన నేపథ్యంలో, చిరు ధాన్యాలతో వివిధ రకాల వంటకాలు తయారు చేశారు. నగరపాలక కమిషనర్ బి.సుమన్‌రావు, రెవెన్యూ అధికారి రాయలింగు, సూపరింటెండెంట్ మనోహర్, అకౌంట్ విభాగం అధికారులు అర్చన, నాగరాజు, మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రజనీ మహిళల వంటకాలను రుచి చూసి విజేతలను ఎంపిక చేశారు. చిరుధాన్యాలతో వంటలు తయారు చేసుకొచ్చిన మహిళలను మున్సిపల్ కమిషనర్ అభినందించారు. విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

స్వశక్తి మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మహిళలను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

పెద్దపల్లిరూరల్: స్వశక్తిసంఘాల మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వీలుగా వార్షిక ప్రణాళికలను రూపొందించుకోవాలని డీపీఎం తిరుపతి అన్నారు. పెద్దపల్లిలో మండల జాగృతి సమాఖ్య ఆధ్వర్యంలో విజన్ బిల్డింగ్ వార్షిక కార్యాచరణ ప్రణాళికపై శుక్రవారం వీవోఏ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగి సమాజంలో గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సంపత్, డీఎం గోవర్ధన్, సీసీలు హరిబాబు, లక్ష్మి, సతీశ్‌కుమార్, రాజు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

పాలకుర్తి: మండలంలోని వేంనూర్‌లో గోదావరి అర్బన్ సొసైటీ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంక్ మేనేజర్ కొమ్ము రమేశ్ గ్రామంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళలను పూలమాల, శాలువాతో సత్కరించి వారికి జ్ఞాపికను అందజేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది గర్వందుల తిరుపతి, జయ, శంకర్, వెంకటేశం, ప్రశాంత్, నందయ్య తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ మహిళగా ప్రశంసా పత్రాలు పొందిన కదంబాపూర్ పంచాయతీ కార్యదర్శి సుజాత, సుద్దాల ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూపను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బాలాజీరావు, ఎంపీడీవో శశికళ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో ఫయాజ్ అలీ, ఏపీవో లావణ్య, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన



జూలపల్లి: మండలంలోని తేలుకుంటలో సోమవారం నుంచి ప్రారంభించనున్న కంటివెలుగు వైద్య శిబిరం ఏర్పాట్లను మండల వైద్యాధికారి సంపత్ రెడ్డి, సర్పంచ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కంటివెలుగు శిబిరంలో గ్రామస్తులందరూ కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో కిరణ్, హెచ్‌వో కలీమొద్దీన్, సర్పంచ్ పద్మ శ్యాం, ఏఎన్ఎం రుక్మిణి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఆదర్శంగా కంటి వెలుగు

సుల్తానాబాద్: కంటి వెలుగు పరీక్షలు దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు . సుల్తానాబాద్ పట్టణంలో తొమ్మిదో వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. దేశంలో ఇతర రాష్ట్రాలకు కంటి వెలుగు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీజ, హెచ్‌ఈవో శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ గొట్టం లక్ష్మి, యువ నాయకుడు గొట్టం మహేశ్, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా : 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
మంథని : రాజేశ్ - 9676603963
పెద్దపల్లి : నరేశ్ - 8639544665
రామగుండం : సర్వేశ్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899